సాక్షి
నిజామాబాద్

శుక్రవారం । 14 । మార్చి । 2025



వృథాగా పరిశోధన కేంద్రం

బాల్కొండ నియోజకవర్గస్థాయి పశు వ్యాధుల నివారణ- పరిశోధన కేంద్రం వృథాగా మారింది.

- 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ శుక్ర: 6:31 | సహర్ శని: 5:02

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.9 /19.3

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు శుభ్రత పాటించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ
- మైనారిటీ గురుకులం సందర్శన



నిజామాబాద్‌అర్బన్: వసతిగృహాలు, గురుకులాల్లోని విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ రాజశ్రీ సూచించారు. నాగారంలోని మైనారిటీ గురుకులాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, టాయిలెట్స్, హాస్టల్ పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొనడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అపరిశుభ్రతతో విద్యార్థులకు అంటువ్యాధులైన గజ్జి, తామర వంటివి సోకి అస్వస్థతకు గురవుతారని పేర్కొన్నారు. వార్డెన్ అందుబాటులో ఉంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వంట చేసే ముందు కూరగాయలను శుభ్రంగా కడగాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీవోఎస్సీడీ డాక్టర్ సామ్రాట్ యాదవ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సబీయుద్దీన్, హెచ్‌ఈవో గిరిబాబు, నాగరాజు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ (సీబీసీఎస్) పరీక్షలకు సంబంధించి 1, 3, 5వ సెమిస్టర్ రెగ్యులర్, 2, 4, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ థియరీ (నవంబర్, డిసెంబర్– 2024, పరీక్షలకు హాజరైన విద్యార్థులు మాత్రమే) పరీక్షలకు సంబంధించి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో పేపర్‌కు రూ.500లు, రీవాల్యుయేషన్ ఫామ్‌కు రూ.25లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 20లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించండి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 2,4,6వ సెమిస్టర్ రెగ్యులర్, 1,3,5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ 2020–24 బ్యాచ్ విద్యార్థులు ఈ నెల 26లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని కంట్రోలర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ షెడ్యూల్‌కు సంబంధించిన పరీక్షలు ఏప్రిల్, మేలో జరుగుతాయన్నారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 27వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

జిల్లా హాకీ జట్టు ఎంపిక



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మినీ స్టేడియంలో గురువారం రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల పురుషుల హాకీ టోర్నమెంట్‌కు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా హాకీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గంగారెడ్డి, రమణ తెలిపారు. ఈనెల 16,17,18 తేదీల్లో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో జిల్లా జట్టు పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కొండ్రా అంజు, ఈసీ సభ్యులు సదక్ నాగేష్, సీనియర్ క్రీడాకారులు జిన్నా గంగాధర్, నర్సింగ్ పాల్గొన్నారు.

విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలి



నిజామాబాద్ సిటీ: పదో తరగతి విద్యార్థులు ఫైనల్ పరీక్షలకు సిద్ధం కావాలని, భయపడకుండా పరీక్షలు రాయాలని డీఈవో అశోక్ సూచించారు. జిల్లాకేంద్రంలోని బోర్గాం(పి) ఉన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అసెంబ్లీ నిర్వహణ, విద్యార్థుల హాజరు, క్రమశిక్షణ చూసి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు గణితం పాఠాలు బోధించారు. సుమీష అనే 9వ తరగతి విద్యార్థిని గణితంలో ప్రతిభ చూపడంతో వెంటనే తన జేబులోంచి రూ.500 బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.



నగరంలోని గాంధీ చౌక్‌లో ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కామదహనం

ఘనంగా కామదహనం

నేడు హోలీ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా గురువారం సాయంత్రం కామదహన వేడుకలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. హోలీకి ముందు రోజు కామదహనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇంటింటా తిరిగి సేకరించిన పిడకలు, కర్రలను గ్రామ, పట్టణాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నెయ్యి పోస్తూ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం జిల్లాలో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు పిల్లలు, యువత, పెద్దలు సిద్ధమయ్యారు. – సాక్షి నెట్‌వర్క్

'ఇంటర్'లో 651 మంది గైర్హాజరు

నిజామాబాద్‌అర్బన్ : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మ్యాథ్స్ 1బీ, హిస్టరీ, జువాలజీ పరీక్షలకు 651 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో మొత్తం 18,197 మంది విద్యార్థులకు 17,546 మంది పరీక్షలు రాశారని, 53 కేంద్రాలను తనిఖీ చేసినట్లు ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

నిజామాబాద్‌అర్బన్: ఈ నెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు కొనసాగుతాయని, అనంతరం మధ్యాహ్న భోజనం అందించాల్సి ఉంటుందన్నారు. పదో తరగతి పరీక్షలు జరిగే పాఠశాలల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలన్నారు. అన్ని యాజమాన్య పాఠశాలలు సమయపాలన పాటించాలని పేర్కొన్నారు.

నగర పాలకంలో | పట్టు ఎవరిదో?

- కాలపరిమితి పూర్తి కావడంతో ఎన్నికలెప్పుడొస్తాయనే ఆసక్తి
- గ్రౌండ్ వర్క్ చేస్తున్న బీజేపీ కేడర్
- అభ్యర్థులను గుర్తించే పనిలో కాంగ్రెస్
- నిస్తేజంలోనే బీఆర్‌ఎస్ శ్రేణులు
- సీట్లు పెంచుకునేందుకు ఎంఐఎం కసరత్తులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఇందూరు నగరపాలక సంస్థలో ఈసారి ఎవరు పాగా వేయనున్నారనే విషయంలో ఆసక్తి నెలకొంది. జిల్లా కేంద్రంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీలు ప్రాబల్యం కలిగి ఉన్నాయి. అయితే మేయర్ పీఠం కోసం రెండు జాతీయ పార్టీల మధ్య పోరు జరుగుతుందని వివిధ వర్గాల వారు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున నగరంలో పాగా వేయాలని కాంగ్రెస్ నాయకులు ఆశిస్తున్నారు. కాగా ఎన్నికలు ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయనే ఆలోచనలో కాంగ్రెస్ శ్రేణులు ఉన్నాయి. మరోవైపు ప్రభుత్వ పథకాల అమలులో క్షేత్రస్థాయిలో అనుకున్నంత మేర సానుకూలత లేకపోవడంతో కాంగ్రెస్ కార్యకర్తలు వేచిచూసే ధోరణిలో ఉన్నారు. ముఖ్యంగా నగరంలో పార్టీ ఇన్‌చార్జి ఎవరనేది ఒక స్పష్టత లేకపోవడంతో నాయకులు, కార్యకర్తల్లో గందరగోళం నెలకొని ఉంది. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీలలో ఎవరు లీడ్ తీసుకుంటారనేది క్లారిటీ లేదు. దీంతో పార్టీ శ్రేణులు ఉత్సాహం కనబరచడం లేదు. అయితే నగర పార్టీ ఆధ్వర్యంలో అయా డివిజన్ల వారీగా అభ్యర్థులను ఎవరిని ఎంపిక చేయాలి, ఆయా అభ్యర్థుల గెలుపోటముల అవకాశాలపై లెక్కలు వేస్తున్నారు. పార్టీ నాయకత్వం మాత్రం నగరపాలకంలో ఎట్టిపరిస్థితుల్లోనూ పాగా వేయాలని దిశానిర్దేశం చేసింది.

■ అధికారంలో ఉన్న సమయంలోనే 60 సీట్లకు కేవలం 13 సీట్లకే పరిమితమైన బీఆర్‌ఎస్ ఈసారి అధికారం లేకపోవడంతో మరింత నిస్తేజంలోకి వెళ్లింది. బీఆర్‌ఎస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో అంతగా కార్యక్రమాలు చేపట్టడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నువ్వా నేనా అనేవిధంగా బరిలో కొట్లాడనున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గింది. మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా స్థానికంగా ఉండకుండా పూర్తిగా బయటనే ఉంటుండడంతో శ్రేణులు అంతగా కదలడం లేదు. ఎమ్మెల్సీ కవిత ఇటీవల కాలంలో మధ్యమధ్యలో వచ్చివెళుతున్నప్పటికీ శ్రేణులకు భరోసా కల్పించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

■ గత ఎన్నికల్లో 16 మంది కార్పొరేటర్లను గెలుచుకుని డిప్యూటీ మేయర్ స్థానంలో కొనసాగిన ఎంఐఎం ఈసారి సీట్ల సంఖ్యను పెంచుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

■ నగరపాలకంలో పాగా వేసేందుకు బీజేపీ ప్రణాళికలు రచిస్తోంది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సరే బరిలో కొట్లాడేందుకు బీజేపీ, సంఘ్ పరివార్ శ్రేణులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పకడ్బందీగా వర్క్ చేస్తున్నాయి. కార్యకర్తలు సైలెంట్‌గా పనిచేసుకుంటూ వెళుతున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే సైతం బీజేపీ నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండడంతో పక్కా ప్రణాళికలు రచిస్తున్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆధ్వర్యంలో నగరంలో ఒక విడత సర్వే పూర్తి చేశారు. సర్వేలో తమకు పూర్తి సానుకూలంగా ఉందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఎట్టిపరిస్థితుల్లో మేయర్ పీఠం దక్కించుకునేందుకు కమలనాథులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో 60 సీట్లకు గాను అత్యధికంగా 28 కార్పొరేటర్ల స్థానాలను గెలుచుకున్న బీజేపీ అతిపెద్ద పార్టీగా నిలిచింది. ఈసారి మరింత ప్రాబల్యం పెంచుకున్న నేపథ్యంలో ఏమాత్రం పట్టు వదలకూడదనే లక్ష్యంతో బీజేపీ పావులు కదుపుతోంది. ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో తాజాగా జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం నగరంలో పకడ్బందీగా పనిచేశారు. ఇదే ఊపుతో నగరపాలక ఎన్నికల్లోనూ పనిచేసి సానుకూల ఫలితం సాధించేందుకు కసరత్తులు చేస్తున్నారు.

హౌసింగ్‌లో ఆ నలుగురే!

లక్ష్యం మాత్రం కొండంత

- జిల్లాలో ఇద్దరు డిప్యూటీ ఇంజినీర్లు, ఇద్దరు ఏఈఈలు
- 'ఇందిరమ్మ ఇళ్ల'పై ప్రభావం చూపే అవకాశం
- తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల నిర్మాణ లక్ష్యం
- పెరగనున్న పనిభారం



మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఉద్యోగుల కొరత ప్రభావం చూపనుంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని భారీగా నిర్దేశించిన ప్రభుత్వం.. అందుకు అనుగుణంగా గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగుల సంఖ్య పెంపుపై దృష్టి సారించడం లేదు.

సొంత స్థలం, అర్హత ఉన్నవారు ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున సాయం అందించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పునరుద్ధరించిన విషయం తెలిసిందే. ఒక్కో నియోజకవర్గంలో తొలి విడతలో 3,500 ఇళ్లకు సాయం అందించేందుకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. అందులో భాగంగానే గృహ నిర్మాణ సంస్థకు మరోసారి జీవం పోశారు. లక్ష్యానికి అనుగుణంగా ఇళ్లను నిర్మించడంతోపాటు ప్రభుత్వం అందించే సాయం పక్కదారి పట్టకూడదనే ఉద్దేశంతో పక్కా పర్యవేక్షణకు గృహ నిర్మాణ సంస్థలో ఇంజినీర్లను నియమించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఇద్దరు డిప్యూటీ ఇంజినీర్లు, మరో ఇద్దరు ఏఈఈలను మాత్రమే విధుల్లోకి తీసుకున్నారు. గతంలో హౌసింగ్ సంస్థలో విధులు నిర్వహించి మరో ఇంజినీరింగ్ శాఖకు బదిలీ అయిన అధికారులను వారి మాతృ శాఖలోకి ఆహ్వానించారు. జిల్లా అంతటా తొలి విడతలో 18,500 ఇళ్ల నిర్మాణానికి ఆర్థికసాయం అందించే అవకాశం ఉంది. కానీ, ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించేందుకు నలుగురు ఇంజినీర్లు మాత్రమే ఉండడంతో వారిపై పనిభారం పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో ఒక్కో నియోజకవర్గానికి ఇద్దరు లేదా ముగ్గురు ఏఈఈలు, మండలానికి నలుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించేవారు. డివిజన్‌కు ఒక డిప్యూటీ ఇంజినీర్ పర్యవేక్షించేవారు.

ఎంపీడీవోలే బిల్లులు చెల్లించేలా..

ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునేవారికి నాలుగు విడతల్లో రూ.5 లక్షల సాయం అందించనున్నారు. అందుకోసం ఎంపీడీవోల ఫోన్‌లలో ప్రత్యేక యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. బిల్లుల తయారీ, చెల్లింపుల బాధ్యత గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్లపై లేకున్నా పర్యవేక్షణ అంశం వారిదే కావడం గమనార్హం. హౌసింగ్ ఉద్యోగులే మార్కింగ్ ఇచ్చి ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకూ అన్ని దశలను పర్యవేక్షించి నివేదికను సమర్పించాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా నలుగురే అధికారులు ఉండడంతో నిర్దేశిత సమయంలో పరిశీలన పూర్తవుతుందా అనే సంశయం నెలకొంది.

రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి

- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీ సుదర్శన్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్‌అర్బన్ : ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ తదితర వాటితో ముడిపడిన అంశాలపై చర్చించేందుకు వీలుగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీ సుదర్శన్ సూచించారు. జిల్లా కలెక్టర్లు, ఈఆర్వోలతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అధికారులు తమతమ స్థాయిలో రాజకీయ పార్టీలతో మీటింగ్‌లు ఏర్పాటు చేసి అప్‌డేట్స్ అందించాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలు, చేసిన తీర్మానాలను రిజిస్టర్లలో నమోదు చేసి వివరాలను సీఈవో కార్యాలయానికి, గుర్తింపు పొందిన పార్టీల ప్రధాన కార్యాలయాలకు పంపించాలన్నారు. ఓటరు జాబితా సవరణకు సంబంధించి కొత్తగా వచ్చిన దరఖాస్తులను వెనువెంటనే పరిశీలిస్తూ సకాలంలో పరిష్కరించాలని సూచించారు. వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో సాగితే అద్భుతాలు

- మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం
- అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



సన్మానం పొందిన మహిళలతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు

నిజామాబాద్‌అర్బన్: మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో గురువారం ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ జ్యోతిప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అద్భుతాలు సాధించగలరని అన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గుర్తు చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి తెచ్చిందని, క్యాంటీన్‌ల నిర్వహణ, యూనిఫాంలు కుట్టే బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులు ఇంటి పనులు, ఉద్యోగ విధులను సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం మహిళా ఉద్యోగులు, వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, జిల్లా పౌర సంబంధాల అధికారిణి నార్ల పద్మశ్రీ , జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుమన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హోలీ వేళ అల్లర్లను ఊపేక్షించం

- మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులే
- బెట్టింగ్ యాప్‌లపై సమాచారం ఇవ్వండి
- రేపటి వరకు లిక్కర్ షాపుల మూసివేత
- సీపీ సాయి చైతన్య వెల్లడి

ఖలీల్‌వాడి : ప్రశాంత వాతావరణంలో హోలీ పండుగను జరుపుకోవాలని నిజామాబాద్ సీపీ పీ సాయి చైతన్య ప్రజలకు సూచించారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ హోలీకి ఆరోగ్యకరమైన సంప్రదాయ రంగులను వాడాలన్నారు. శుక్రవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేడుక జరుపుకోవాలని సూచించారు. పండుగను ఇష్టపడని వ్యక్తులపై, వాహనాలపై రంగులు చల్లటం సరికాదన్నారు. బహిరంగ ప్రాంతాల్లో ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, అల్లర్లకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైక్ ర్యాలీలు, రహదారులపై ఇష్టం వచ్చినట్లు తిరుగొద్దన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

హున్సా 'పిడిగుద్దుల'పై సమీక్షిస్తాం..

బోధన్ మండలం హున్సాలో హోలీ రోజు నిర్వహించే పిడిగుద్దుల ఆటను నిషేధించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో మీడియా ప్రతినిధులు సీపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీపీ స్పందిస్తూ పిడిగుద్దులపై ఎలాంటి నిషేధం విధించలేదన్నారు. ఈ ఆటకు ఎంతమంది హాజరవుతారనేదానిపై సమీక్షించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. హిజ్రాలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.

బార్లు, వైన్స్ షాపులు బంద్

జిల్లాలోని లిక్కర్, బార్ షాపులను గురువారం సాయంత్రం 6 నుంచి శనివారం సాయంత్రం 6 గంటల వరకు మూసివేస్తున్నట్లు సీపీ సాయి చైతన్య వెల్లడించారు. హోలీ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపడంతో ప్రమాదాలు, గొడవలు జరిగే ఆస్కారం ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బంగులో గంజాయి వంటి మత్తు పదార్థాలు కలుపుకొని తాగితే చర్యలు తీసుకుంటామన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

బెట్టింగ్ నిర్వాహకులపై చర్యలు

జిల్లాలో యువకులు, విద్యార్థులు బెట్టింగ్ బారినపడి అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నారని సీపీ సాయి చైతన్య తెలిపారు. ఎక్కడైనా బెట్టింగ్ ఆడినా, బెట్టింగ్ యాప్‌లు నిర్వహించినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బెట్టింగ్ ఆడేవారికి కౌన్సెలింగ్ ఇచ్చి యాప్ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఏటీసీలకు అనువైన స్థలాలు గుర్తించాలి

- గ్రామీణ నియోజకవర్గాల్లోనే అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు
- రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్
- కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్ : యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ నియోజకవర్గాల్లో నూతనంగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ)ఏర్పాటు చేయాలని సంకల్పించినట్లు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్లతో గురువారం జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో 70 ఏటీసీల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. ఇదే తరహాలో ఐటీఐ, ఏటీసీలు లేని ప్రతి గ్రామీణ ప్రాంత అసెంబ్లీ సెగ్మెంట్‌లో కనీసం ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఏటీసీల నిర్మాణానికి అనువైన ప్రదేశం, స్థలాన్ని గుర్తిస్తూ సమగ్ర వివరాలతో కూడిన నివేదికలను త్వరితగతిన సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. రోడ్డు, రవాణా వసతితో పాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేస్తే ఏటీసీల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందడానికి, ఇన్‌స్ట్రక్టర్లు సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభించేందుకు దోహదపడినట్లు అవుతుందన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ జిల్లాలోని ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏటీసీల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి నివేదికను సోమవారంలోపు పంపిస్తామని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత, విత్తనశుద్ధి పరిశ్రమలకు అనుగుణంగా ఏటీసీల్లో కోర్సులను ప్రవేశపెట్టేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జూమ్ మీటింగ్‌లో సంబంధిత శాఖల అధికారులు, ఐటీఐ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలకు హోలీ శుభాకాంక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: హోలీ పండుగను పురస్కరించుకుని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. రాగ ద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్కచోట చేర్చే ఈ హోలీ వేడుక ప్రజలందరి జీవితాలలో సంతోషపు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. సహజ రంగులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా హోలీ నిర్వహించుకోవాలని కోరారు.

పోచారం రైల్వేగేటు మూసివేత



ఎడపల్లి(బోధన్‌): మండలంలోని పోచారం వద్దగల రైల్వేగేటును గురువారం రైల్వే సిబ్బంది మూసివేశారు. రైల్వేగేట్‌ వద్ద అండర్‌ పాస్‌ రహదారి పనులు ప్రారంభమైన సందర్భంగా గేట్‌ను మూసేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. 12నెలలపాటు ఈ పనులు కొనసాగుతాయని అటువైపు వెళ్లే వాహనదారులు దూపల్లి గేటు నుంచి ప్రయాణాలు కొనసాగించాలని వారు సూచించారు

పసుపు బోర్డు ఎక్కడుందో ఎంపీ అర్వింద్‌ చెప్పాలి



మాట్లాడుతున్న ముప్పగంగారెడ్డి

నిజామాబాద్‌ సిటీ: జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుచేశామని గొప్పలు చెప్పుకుంటున్న ఎంపీ అర్వింద్‌ అసలు పసుపు బోర్డు ఎక్కడుంది? దాని విధివిధానాలు ఏమిటో చెప్పాలని నిజామాబాద్‌ మార్కెట్‌కమిటీ చైర్మన్‌ ముప్ప గంగారెడ్డి ప్రశ్నించారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిట్టుబాటు ధర రాకపోవడంతో పసుపు రైతులు రోడ్డెక్కుతున్నారని అన్నారు. పసుపు రైతుల సమస్యలను కాంగ్రెస్‌ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. నవోదయ విద్యాలయం రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కృషితోనే సాధ్యమైందన్నారు. కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలపై ఎంపీ అర్వింద్‌, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌ నాయకులపై మాట్లాడేముందు బీజేపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.

డీఎస్పీ కార్యాలయం తనిఖీ



మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్‌ చంద్ర

కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయాన్ని గురువారం ఎస్పీ రాజేశ్‌ చంద్ర సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. సబ్‌ డివిజన్‌లోని పోలీస్‌ స్టేషన్‌లకు సంబంధించిన అధికారులు, సిబ్బంది వివరాలను ఏఎస్పీ చైతన్యారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట జిల్లా స్పెషల్‌ బ్రాంచ్‌ ఇన్‌స్పెక్టర్‌ తిరుపయ్య ఉన్నారు.

ఆనందాల రంగుల కేళీ.. హోలీ





నగరంలోని గాంధీచౌక్‌లో రంగులు, రంగుల స్ప్రే పరికరాలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

- నేడు వేడుకలకు సిద్ధమైన ప్రజలు
- మార్కెట్లలో జోరుగా రంగులు, రంగుల పరికరాల విక్రయాలు



ఆర్మూర్‌లో వెలిసిన రంగుల దుకాణం

నిజామాబాద్‌ రూరల్‌/ఆర్మూర్‌: రంగుల కేళీ హోలీ పండుగకు రంగం సిద్ధమైంది. జిల్లావ్యాప్తంగా నేడు పండుగను ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. నిన్నటి రోజున కాముని దహనం భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, శుక్రవారం హోలీ పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకొనున్నారు. వసంత రుతువులో వచ్చే తొలి వేడుక ఇది. వసంతగమనాన్ని, కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ పౌర్ణమి రోజు వచ్చే ఈ పర్వదినాన్ని వసంతోత్సవం అని అంటారు. ఈ పండుగ రోజు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ సంతోషంగా జరుపుకొంటారు. హోలీ సందర్భంగా జిల్లాకేంద్రంతోపాటు అన్ని మండలాలు, పట్టణాల్లో రంగుల దుకాణాలు వెలిశాయి. చిన్నారుల కోసం హోలీ గన్స్‌, గులాలు, పంపులు వంటి వాటిని విక్రయిస్తున్నారు. అలాగే కుడుకల పేర్లు.. చక్కరబెండ్లు విక్రయాలు సైతం జోరుగా కొనసాగుతున్నాయి. హోలీ పండుగను సంప్రదాయం ప్రకారం జరుపుకోవాలని, రసాయన రంగులతో కాకుండా సహజ రంగులు వాడాలని వైద్యులు సూచిస్తున్నారు. రసాయన రంగులు వాడేసమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. పండుగను ప్రజలు శాంతియుతంగా, సురక్షితంగా జరుపుకోవాలని పోలీసులు, వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



కుడుకల పేర్లు



చక్కెర పేర్లు

ప్రశాంతంగా జరుపుకోవాలి



హోలీ పండుగను హద్దులు దాటి జరుపుకోవద్దు. బలవంతంగా రంగులు వేయడం, అసభ్య ప్రవర్తనకు పాల్పడకూడదు. మద్యం సేవించి అల్లర్లు సృష్టించకూడదు. ట్రాఫిక్‌ నిబంధనలు పాటించి, రోడ్లపై జాగ్రత్తగా ఉండాలి.

– సత్యనారాయణగౌడ్‌, ఎస్‌హెచ్‌వో, ఆర్మూర్‌

హానికర రంగులు వాడొద్దు



రసాయనాలు ఉన్న రంగులు ఉపయోగించకూడదు. చర్మానికి, కళ్లకు హాని కలిగించే రంగుల నుంచి దూరంగా ఉండాలి. చిన్నారులు, పెద్దలు, అలర్జీ సమస్యలున్న వారు జాగ్రత్తగా ఉండాలి.

– రమేశ్‌, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ఆర్మూర్‌



వివిధ రకాల రంగులు

తెయూ సమాచారం..

క్యాంపస్‌లో ఉపాధి హామీ పనులకు సహకరించండి



తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరితో మాట్లాడుతున్న మండల అధికారులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌ ఆవరణలో జాతీయ ఉపాధిహామీ పథకం పనులు చేపట్టడానికి సహకరించాలని డిచ్‌పల్లి మండల ప్రత్యేకాధికారి పల్నాటి యోహాన్‌, ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్‌ కోరారు. ఈమేరకు గురువారం తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరిని కలిసి వారు మాట్లాడారు. ఉపాధి హామీ పథకం కింద వాటర్‌ హార్వెస్టింగ్‌, ఫాంపాండ్స్‌, పిట్స్‌, ఇతర పనులు చేయడానికి అనుమతించాలన్నారు. తద్వారా ఉపాధిహామీ పని దినాలను సక్రమంగా వినియోగించుకొని క్షేత్రస్థాయిలో కార్మికుల సంఖ్యను పెంచుకోవడానికి వీలుంటుందన్నారు. వర్సిటీ ఇంజినీర్‌తో మాట్లాడి ఏఏ పనులు చేయవచ్చో నిర్ణయించి శనివారం తెలియజేస్తామని రిజిస్ట్రార్‌ తెలిపారు. ఏపీఎం మంజుల, ఈసీ సుధాకర్‌రెడ్డి, టీఏలు ఉమేష్‌, అరుంధతి, పరమేశ్‌, సాయికుమార్‌, నడిపల్లి జీపీ కార్యదర్శి నిట్టు కిషన్‌రావు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



శ్రమదానం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు

తెయూ(డిచ్‌పల్లి): మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని తెలంగాణ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రవీణ్‌ మామిడాల అన్నారు. తెయూ ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో గురువారం ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజ్‌ ఆవరణలో వలంటీర్లు శ్రమదానం నిర్వహించారు. కాలేజ్‌ పరిసరాలలో ఉన్న వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్‌ కవర్స్‌, ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ.. కళాశాలలతోపాటు హాస్టళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్‌ కో–ఆర్డినేటర్‌ రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారి ఐలేని మహేందర్‌, వలంటీర్లు పాల్గొన్నారు.

తెయూకు ఈశ్వరీబాయి పేరు పెట్టాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి తెలంగాణ పోరాట యోధురాలు ఈశ్వరీ బాయి పేరు పెట్టాలని ఆల్‌ మాల స్టూడెంట్స్‌ అసోసియేషన్‌, ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం, సమత వలంటరీ ఫోర్స్‌ సంఘాల సభ్యులు గురువారం వర్సిటీ రిజిస్ట్రార్‌ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రదీప్‌, గొర్కంటి లింగన్న, కిరణ్‌, అనుపాల్‌, లక్ష్మణ్‌, భార్గవ్‌, దినకర్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి

తెయూ(డిచ్‌పల్లి): విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 18న కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించే యూనివర్సిటీల విద్యార్థుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్‌ కోరారు. తెయూ క్యాంపస్‌లో రాష్ట్ర సదస్సు కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. యూజీసీ నూతన ముసాయిదాను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం



వినియోగదారుల సమస్యలు వింటున్న అధికారులు

నిజామాబాద్‌ సిటీ: విద్యుత్‌ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని విద్యుత్‌ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్‌ నారాయణ అన్నారు. జిల్లాకేంద్రంలోని పవర్‌హౌస్‌లో గురువారం విద్యుత్‌ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. డివిజన్‌ పరిధిలోని వినియోగదారుల నుంచి చైర్మన్‌ నారాయణ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. విద్యుత్‌శాఖ సిబ్బంది రామకృష్ణ, కిషన్‌, రాజారెడ్డి, శ్రీనివాస్‌, చంద్రశేఖర్‌, మంగ్యానాయక్‌, నగేష్‌, రావూఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీ లెక్కింపు



హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నిజామాబాద్‌ రూరల్‌: శ్రీ బడా రాంమత్‌ ఆలయంలో గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. మొత్తం రూ.89,320 ఆదాయం వచ్చింది. నగరంలోని శంభులింగేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ లెక్కించగా రూ.1,09,815 ఆదాయం వచ్చింది. శాఖ సహాయ కమిషనర్‌ విజయ రామారావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి రాములు, శాఖ పరిశీలకులు కమల, శ్రీ బడారాంమత్‌ ఫిట్‌మాన్‌ వేణు, జూనియర్‌ అసిస్టెంట్‌ ప్రశాంత్‌ కుమార్‌ ఉన్నారు.

వృథాగా ‘పరిశోధన కేంద్రం’



బాల్కొండ: మండల కేంద్రంలో బాల్కొండ నియోజకవర్గ స్థాయి పశువుల వ్యాధుల నివారణ–పరిశోధన కేంద్రం నిర్మించి పదేళ్లు అవుతోంది. అయినా ఇప్పటివరకు సిబ్బందిని నియమించకపోవడంతో ఇక్కడ ఎలాంటి పరిశోధన చేపట్టలేదు. దీంతో పరిశోధన కేంద్రం నిరుపయోగంగా మారింది. పశువుల మూగ వేదన పాలకులకు, ఉన్నత అధికారులకు అర్థం కావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు స్పందించి పరిశోధన కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని పాడి రైతులు కోరుతున్నారు. అలాగే బాల్కొండ పశు వైద్యశాలలో గత రెండేళ్లుగా ఇన్‌చార్జి వైద్యుడే సేవలు అందిస్తున్నాడు. కనీసం పూర్తి స్థాయిలో వైద్యుడిని నియమించాలని రైతులు డిమాండ్‌ చేస్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

మండల కేంద్రంలోని నియోజకవర్గ స్థాయి పశు వ్యాధుల నివారణ–పరిశోధన కేంద్రం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రభుత్వం సిబ్బందిని నియమిస్తే కేంద్రంలో పరిశోధనలు చేపట్టవచ్చు.

– గౌతంరాజు, ఇన్‌చార్జి పశు వైద్యుడు, బాల్కొండ

పసుపు బోర్డును తెచ్చిన ఘనత ఎంపీ అర్వింద్‌దే



మాట్లాడుతున్న బీజేపీ మాజీ కార్పొరేటర్లు

నిజామాబాద్‌ సిటీ: ఎన్నికల సమయంలో పసుపు రైతుల సమస్యలు స్వయంగా చూసి చలించిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌, పసుపు బోర్డు కోసం ఎంతో శ్రమించి జాతీయ పసుపు బోర్డును జిల్లాలో ఏర్పాటు చేయించారని బీజేపీ మాజీ కార్పొరేటర్లు అన్నారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మాజీ కార్పొరేటర్లు పంచరెడ్డి ప్రవళిక, ఇప్పకాయల సుమిత్ర మాట్లాడుతూ.. పసుపు ధర తగ్గడంతో దానికి బాధ్యుడు ఎంపీ అర్వింద్‌ అన్నట్లు బీఆర్‌ఎస్‌ నేతలు మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. ఎంపీ త్వరలో జాతీయ పసుపు బోర్డుకు కావలసిన అన్ని ఏర్పాట్లు కూడా సిద్ధం చేస్తున్నారన్నారు.

విద్యారంగానికి నిధులను కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

నిజామాబాద్‌అర్బన్‌: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు గురువారం కలెక్టరేట్‌ పరిపాలన అధికారి ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శశిధర్‌, బాలకృష్ణ, దుర్గాదాస్‌ ఇంద్రసేన, యోగేశ్‌ రంజిత్‌, మణికంఠ, రఘు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జెడ్పీ కార్యాలయ సమీపంలో ఉన్న మదర్‌ థెరిస్సా విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. నాయకులు విఘ్నేశ్‌, దీపిక, దినేశ్‌, రాజు, ఆజాద్‌, పృథ్వి, పరమేశ్‌, శ్రీ చరణ్‌, రమేశ్‌, అజయ్‌ ఉన్నారు.

సీఎంపై బీఆర్‌ఎస్‌ నేతల వ్యాఖ్యలు సరికావు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్‌ సిటీ: బీఆర్‌ఎస్‌ నాయకులు హరీశ్‌రావు, కవితలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మానాల మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌నుద్దేశించి మాట్లాడిన మాటలను వారు విమర్శిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 14నెలల కాంగ్రెస్‌ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్‌ విసిరారు. హరీశ్‌రావు వ్యాఖ్యలు బీఆర్‌ఎస్‌లో ఆధిపత్య పోరుకోసం చేసినవిధంగా ఉన్నాయన్నారు. హరీశ్‌రావు బీజేపీ కోవర్టులాగా మాట్లాడుతున్నారన్నారు. మార్కెట్‌కమిటీ చైర్మన్‌ గంగారెడ్డి, నాయకులు భోజన్న, భాగారెడ్డి, లింగం, నరేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై ఇరువర్గాల మధ్య ఘర్షణ



విచారణ చేపట్టిన పోలీసులు

పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌): నూతన సీసీ రోడ్డు నిర్మాణ విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరుగగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని జగన్నాథ్‌పల్లి తండాలో గురువారం చోటుచేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని జగన్నాథ్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఇటీవల ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ నిధులతో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈక్రమంలో రోడ్డు నిర్మాణ ప్రాంతంలో ఈ స్థలం తమది అంటే తమదని ఇరువర్గాల మధ్య ఘర్షణ ప్రారంభమైంది. రెండు వర్గాలవారు రెచ్చిపోయి ఇటుకలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఓ మహిళతోపాటు ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై మహేందర్‌ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేట్టారు. గాయపడ్డ హుషార్‌ సింగ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్‌

168 డ్రంకన్‌డ్రైవ్‌ కేసులు నమోదు

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో గత మూడు రోజుల వ్యవధిలో డ్రంకన్‌డ్రైవ్‌ తనిఖీల్లో 168 మంది పట్టుబడినట్లు పోలీస్‌ కమిషనర్‌ సాయిచైతన్య ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపి, పట్టుపడితే డ్రంకన్‌డ్రైవ్‌ కేసులు నమోదు చేసి, జైలుకు పంపిస్తామన్నారు.

మట్కా నిర్వాహకుడికి 2రోజుల జైలు

బోధన్‌: పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న జమీల్‌ ఖాన్‌ అనే వ్యక్తిని పోలీసులు పట్టుకొని, బోధన్‌ కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి అతడికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారని టౌన్‌ సీఐ వెంకట నారాయణ తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశంలో మద్యం తాగిన వ్యక్తికి జడ్జి ఒక రోజు జైలుశిక్ష విధించారని అన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్‌

ఖలీల్‌వాడి: గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నార్త్‌ సీఐ బూక శ్రీనివాస్‌ తెలిపారు. నగరంలోని బాబన్‌ సాహెబ్‌ పహాడ్‌ వద్ద గురువారం ఉదయం ఎస్సై గంగాధర్‌ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పల్సర్‌ బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. తనిఖీ చేసి, వారి నుంచి 390 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిలో ఒకరు నగరంలోని దొడ్డి కొమరయ్య కాలనీకి చెందిన హొనుశెట్టి రవి (25)గా, మరొకరు మహారాష్ట్రకు చెందిన సయ్యద్‌ జిలానీ(26)గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులు నాందేడ్‌ ఏరియాలో గుర్తుతెలియని వ్యక్తుల దగ్గర గంజాయి కొనుగోలు చేసి అధిక డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో నిజామాబాద్‌ పరిసర ప్రాంత గ్రామాలలో అమ్ముతున్నట్లు విచారణలో తెలిసిందన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి



పోచయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి: హోలీ పండుగ సందర్భంగా గురువారం ఎల్లారెడ్డి మటన్‌ మార్కెట్‌కు వచ్చిన ఓ వృద్ధుడిని ఆటో ఢీకొనడంతో మృతిచెందాడు. ఎస్సై మహేష్‌ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని సబ్దల్‌పూర్‌ గ్రామానికి చెందిన గడ్డం పోచయ్య (64) మటన్‌ కోసం ఎల్లారెడ్డికి వచ్చాడు. పట్టణంలోని గాంధీచౌక్‌ ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తుండగా అతడిని వెనక నుంచి ఆటో వచ్చి ఢీకొట్టింది. ఈఘటనలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి వృద్ధురాలు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముంబోజిపేట గ్రామ శివారులోగల సింగయ్య చెరువులో ఓ వృద్ధురాలు పడి మృతిచెందినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మాదిగ కాశవ్వ(60) అనే వృద్ధురాలు నాలుగు రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. గురువారం భవానిపేట, ముంబోజిపేట శివారులోని సింగయ్య చెరువులో ఆమె మృతదేహం తేలింది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్‌



మాచారెడ్డి: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్‌ చేసినట్లు మాచారెడ్డి ఎస్సై అనిల్‌ గురువారం తెలిపారు. పాల్వంచ మండలం బండ రామేశ్వర్‌పల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తాము పెట్రోలింగ్‌ నిర్వహించామన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్‌ చేసి కేసు నమోదు చేశామని, వాహనాలను పోలీస్‌ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

బిచ్కుందలో రేషన్‌ షాపు..



షాపును సీజ్‌ చేస్తున్న అధికారులు

బిచ్కుంద(జుక్కల్‌): మండల కేంద్రంలోని రేషన్‌ షాపు డీలర్‌ అక్రమాలకు పాల్పడటంతో దుకాణాన్ని సీజ్‌ చేసినట్లు ఆర్‌ఐ రవిందర్‌ గురువారం తెలిపారు. రేషన్‌ బియ్యంను ప్రజలకు పంపిణీ చేయకుండా అక్రమాలకు పాల్పడ్డాడని ఫిర్యాదు రావడంతో తహసీల్దార్‌ ఆదేశాల మేరకు షాపులో తనిఖీ చేశామన్నారు. విచారణ చేపట్టడంతో అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో షాపును సీజ్‌ చేసినట్లు తెలిపారు.

హత్యకేసులో ఒకరికి జీవితఖైదు

కామారెడ్డి క్రైం: హత్యకేసులో ఒకరికి జీవితఖైదు శిక్షను విధిస్తూ కామారెడ్డి కోర్టు ప్రధాన న్యాయ మూర్తి వీఆర్‌ఆర్‌ ప్రసాద్‌ గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా.. నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెద గ్రామానికి చెందిన కర్రే రామకృష్ణయ్య, కర్రే రాజయ్య మధ్య గత కొన్నేళ్లుగా భూ తగాదాలు నడిచాయి. 2020 అక్టోబర్‌ 17న రామకృష్ణయ్య తన భార్య బాలమణి, కొడుకు ప్రవీణ్‌తో కలిసి రాజయ్య ఇంటికి వెళ్లి పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడారు. రాజయ్య అకారణంగా కర్రతో రామకృష్ణయ్య తల, నడుంపై బలంగా కొట్టాడు. వెంటనే కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కోర్టులో నేరం రుజువు కావడంతో నేరస్తుడు రాజయ్యకు జీవితఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు. ఎల్లారెడ్డి సీఐ రాజశేఖర్‌, ఏఎస్సై సుబ్రమణ్యాచారి, పీపీ రాజగోపాల్‌గౌడ్‌, ప్రస్తుత సీఐ రవీంద్రనాయక్‌, ఎస్సై మల్లారెడ్డి, కోర్టు లైజనింగ్‌ ఆఫీసర్‌ ఎస్సై మురళీ, కానిస్టేబుల్‌ సాయిలును ఎస్పీ రాజేశ్‌చంద్ర అభినందించారు.

ఇస్రోజీవాడిలో ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన చెట్కూరి దేవయ్య (55) వ్యవసాయం చేసుకుంటు, జీవనం సాగించేవాడు. గురువారం ఉదయం పొలానికి వెళ్లిన అతడు అక్కడే ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న దేవునిపల్లి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని, విచారణ జరిపారు. దేవయ్య చాలా రోజులుగా కడుపునొప్పితో బాధపడేవాడనీ, ఎన్ని మందులు వాడినా తగ్గలేదని అతడి భార్య భాగవ్వ తెలిపారు. కడుపునొప్పి భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు వెల్లడించారు.

వ్యక్తి పుర్రె, ఎముకలు లభ్యం



లభ్యమైన పుర్రె, ఎముకలు

నవీపేట: మండలంలోని బినోల శివారులో గురువారం మానవ మృత కళేబరాలు లభ్యమైనట్లు ఎస్సై వినయ్‌ తెలిపారు. ఘటన స్థలంలో పుర్రె, ఎముకలు, దుస్తువుల ఆనవాళ్లు వేర్వేరుగా పడి ఉన్నాయన్నారు. కొన్ని నెలల కిందట వ్యక్తి చనిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. గాంధీనగర్‌ కారోబార్‌ మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేకాడుతున్న 10మంది అరెస్టు

ఖలీల్‌వాడి: నగరంలోని వీక్లీబజార్‌, ముదిరాజ్‌ గల్లీలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి, పేకాడుతున్న 10మందిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ ఫోర్స్‌ సీఐ అంజయ్య గురువారం తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి 10 సెల్‌ఫోన్లు, రూ. 66,410 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. తదుపరి చర్య నిమిత్తం కేసును వన్‌టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతికి అప్పగించినట్లు తెలిపారు.